Sakshi

# ఈఎస్ఐలో ఖాళీల వెక్కిరింత

## 2,043 పోస్టులకుగాను 1,158 పోస్టులు ఖాళీయే

- ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతతో కార్మికులకు అరకొరగానే వైద్యం
- అక్టోబర్ 1 నుంచి పెరగనున్న సంస్థ బీమా పరిధి
- రూ. 15 వేల నుంచి రూ. 21 వేల వేతనం వారూ ఈఎస్ఐలోకే..
- పోస్టుల భర్తీపై అధికారుల విజ్ఞప్తిని పట్టించుకోని సర్కారు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ) ఆస్పత్రులను సిబ్బంది కొరత వేధిస్తోంది. వివిధ కేటగిరీల్లో మంజూరైన పోస్టులలో దాదాపు 60 శాతం వరకు ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో 2,043 మంజూరైన పోస్టులకుగాను 1,158 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆస్పత్రుల అవసరాలకు అనుగుణంగా డాక్టర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడంతో ఈఎస్ఐ కార్డులపై చికిత్స కోసం వచ్చే కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అరకొరగానే వైద్య సేవలు అందుతున్నాయి. ఈ సమస్య చాలదన్నట్లుగా ఈఎస్ఐ ఆరోగ్య బీమా పరిధిని విస్తరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించడం ఆస్పత్రులకు గుదిబండగా మారనుంది. ఈఎస్ఐ ఆరోగ్య బీమాలో కార్మికులు చేరేందుకు ప్రస్తుతమున్న రూ. 15 వేల వేతన పరిమితిని రూ. 21 వేలకు పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానుండటంతో ఈఎస్ఐ ఐపీ (బీమా సొకర్యంగల కార్మికుల) సంఖ్య మరింత పెరగనుంది. ప్రస్తుతం ఈఎస్ఐ పరిధిలో రూ. 15 వేల వేతన పరిమితి కింద 12 లక్షల మంది ఐపీలు ఉండగా వేతన పరిమితిని రూ. 21 వేలకు పెంచడం వల్ల ఐపీల సంఖ్య 15 లక్షలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఐపీల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో వైద్య సేవలు ఎలా అందించాలని తర్జనభర్జన పడుతున్నారు.

**కీలక పోస్టులన్నీ ఖాళీయే...**

ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో 127 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్యం అందించే వారే కరువయ్యారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, గ్రేడ్-4కు చెందిన పోస్టుల్లో సిబ్బంది ఖాళీలే ఉన్నాయి. జోనల్ పోస్టులకు సంబంధించి వెయ్యి



పోస్టులకుగాను.. 580 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా స్థాయి పోస్టుల్లో 551 పోస్టులు ఖాళీగా ఉండటంతో ఈఎస్ఐ సిబ్బంది పనిభారంతో సతమతమవుతున్నారు. ఈఎస్ఐ విభాగంలో 1,158 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినా ప్రభుత్వం స్పందించలేదు. మరోవైపు ఈఎస్ఐ నిబంధనల ప్రకారం ఈ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనూ నియమించే అవకాశం లేకపోవడంతో కార్మికులకు వైద్య సేవలపై ఉద్యోగ ఖాళీలు మరింత ప్రభావం చూపనున్నాయి.